## క్లుప్తంగా

### ఐకమత్యంతో వ్యాపారం చేయాలి



సిరికొండ: రైతులు ఐక్యంగా ఉంటూ ఎఫ్‌పీవో ద్వారా వ్యాపారాన్ని పెంపొందించుకోవాలని నాబ్‌కాన్స్ జిల్లా కోఆర్డినేటర్ రాజలింగం సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో రైతు చైతన్య ఉత్పత్తిదారుల సంఘం ద్వితీయ వార్షిక మహాసభను బుధవారం నిర్వహించారు. వ్యాపారం చేసేందుకు నాబార్డు ద్వారా రూ.2కోట్ల వరకు క్రెడిట్ గ్యారంటీ ఫండ్ పొందొచ్చని తెలిపారు. రైతులు సంస్థలో సభ్యులుగా చేరాలన్నారు. ఏవో వెంకటేశ్, ఎఫ్‌పీవో చైర్మన్ కొడిగెల శ్రీనివాస్, డైరెక్టర్లు, సీఈవో రవిశంకర్, రైతులు పాల్గొన్నారు.

### 29న చేనేత సహకార సంఘ సమావేశం



నిజామాబాద్‌నాగారం: ఈ నెల 29న చేనేత సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిర్మల్‌టాకీస్ చౌరస్తాలో ఉన్న సంఘ భవనంలో శుక్రవారం ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి బాల్‌రాజ్, డైరెక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### గంజ్‌లో స్వచ్ఛతా హీ సేవా



నిజామాబాద్‌నాగారం: స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా నగరంలోని గంజ్‌మార్కెట్ పరిసరాలను శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో బుధవారం శుభ్రం చేశారు. చెత్తాచెదారాన్ని తొలగించి వ్యాపారులకు, కూరగాయల విక్రయదారులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు.శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### అసమానతలు లేని సమాజం కోసం పోరాడాలి

నిజామాబాద్‌అర్బన్: అసమానతలు లేని సమాజం కోసం విద్యార్థులు నిరంతరం పోరాడాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. సత్యశోధక్ సమాజ్ 150వ వార్షికోత్సవం సందర్భంగా నగరంలో కుల నిర్మూలన సదస్సును బుధవారం నిర్వహించారు. రాజేశ్వర్ మాట్లాడుతూ, కుల వ్యవస్థను వ్యతిరేకిస్తూ.. అణగారిన కులాలకు విద్యనందించడం కోసం పూలే దంపతులు పోరాటం చేశారన్నారు. సమాజంలో అసమానతల నిర్మూలన, కుల రహిత సమాజం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. నాయకులు పవన్, విజయ్, వంశీ, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు బండమీద నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### రైతు ప్రయోజనాలే ముఖ్యం



మోపాల్(నిజామాబాద్‌రూరల్): రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా సొసైటీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పని చేస్తారని మోపాల్ సొసైటీ చైర్మన్ ఉమాపతిరావు అన్నారు. మండల కేంద్రంలోని సొసైటీ ఆవరణలో చైర్మన్ అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సీఈవో సాయికుమార్ వార్షిక నివేదిక, జమాఖర్చులను చదివి వినిపించారు. రుణమాఫీ కోసం సొసైటీ ద్వారా 1500 మంది ఖాతాల వివరాలను నివేదించినప్పటికీ 390 మందికి వచ్చిందన్నారు. మిగతా వారి పేర్లు, ఖాతా వివరాలు తిరిగి పంపించామని చైర్మన్ ఉమాపతిరావు తెలిపారు. సీరియల్ ప్రకారం ధాన్యం తూకం వేసేలా పకడ్బందీ చర్యలు చేపడుతామని, ఈవిషయంలో సొసైటీ సిబ్బంది రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నెల రోజుల్లో కళ్యాణ మండపం మడిగెలను వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, సర్పంచులు ద్యాప రవి, సాయిరెడ్డి, ముత్యంరెడ్డి, డైరెక్టర్లు గంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్, రాజశేఖర్‌రెడ్డి, నానుసింగ్, నీరడి లింగవ్వ, రైతులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

సాక్షి నెట్‌వర్క్: తెలంగాణవాది, స్వాతంత్ర్య పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో లక్ష్మణ్ బాపూజీ విగ్రహం, చిత్రపటాలకు స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, పద్మశాలీ సంఘ ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పూలమాలలు వేసి, ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అంకితభావం, నిజాయితీగా కృషి చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. ఆయన జీవితాన్ని ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.



నగరంలో లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ ఆకుల లలిత, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, తదితరులు



నగరంలో చేనేత ఐక్యవేదిక ఆధ్వర్యంలో..



సీపీ కార్యాలయంలో..



కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..



మోపాల్‌లో.. (పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో)



ధర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



జక్రాన్‌పల్లిలో.. (పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో)

# అన్ని వర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం



లబ్ధిదారుడికి మైనారిటీ బంధు చెక్కును అందజేస్తున్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్



నిధుల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- లబ్ధిదారులకు మైనారిటీబంధు, షాదీముబారక్ చెక్కుల అందజేత

డిచ్‌పల్లి/సిరికొండ/ధర్పల్లి: రాష్ట్ర ప్రభుత్వానికి హిందూ, ముస్లింలు రెండు కళ్లలాంటి వారని, అన్ని వర్గాల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బోర్గాం(పి) శివారులోని భారతీ గార్డెన్స్‌లో బుధవారం నియోజకవర్గంలోని వివిధ మండలాల లబ్ధిదారులకు మంజూరైన 56 షాదీముబారక్, 56 మైనారిటీబంధు చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే ముస్లింల ఈద్గాలు, మజీద్‌లు, షాదీఖానాలు, స్మశానవాటికల అభివృద్ధి పనులకు రూ.4కోట్ల విలువ గల నిధుల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లింలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. తన వద్దకు వచ్చే పేదలకు నిస్వార్థమైన సేవలందిస్తున్నానని తెలిపారు. అనంతరం వివిధ మండలాల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నుడా చైర్మన్ ఈగ సంజీవ్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, జెడ్పీటీసీలు జగన్, తనూజరెడ్డి, సుమలత, ఎంపీపీలు రమేష్‌నాయక్, నల్లసారిక తదితరులు పాల్గొన్నారు.

**మోపాల్ మండలంలో..**

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగర శివారులోని రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మోపాల్ మండలంలోని వివిధ గ్రామాల కుల సంఘాలకు భవనాల నిర్మాణాల కోసం నిధుల ప్రొసీడింగ్ పత్రాలను ఎమ్మెల్యే బాజిరెడ్డి పంపిణీ చేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే అభివృద్ధి అని, అన్నివర్గాల సంక్షేమానికి సీఎం పాటుపడుతున్నారని పేర్కొన్నారు. సర్పంచ్ సాయిరెడ్డి, ఎంపీటీసీలు, కుల, మహిళా సంఘాల సభ్యులున్నారు.

# నెరవేరిన దశాబ్దాల కల





పడకల్‌లో పూర్తయిన డబుల్ రోడ్డు నిర్మాణం.. మనోహరాబాద్ వద్ద పూర్తయిన వంతెన

- చాంద్‌మియాబాగ్‌-చేంగల్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి
- నేడు రహదారిని ప్రారంభించనున్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

జక్రాన్‌పల్లి:మండలంలోని చాంద్‌మియాబాగ్‌లోని 44వ నెంబర్ జాతీయ రహదారి నుంచి చేంగల్ వరకు డబుల్ నిర్మాణం చేపట్టాలనే ఈ ప్రాంత ప్రజల కల నెరవేరింది. దీంతో టీఎస్‌ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గురువారం రోడ్డును ప్రారంభించనున్నారు. రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.23కోట్లు మంజూరు చేయగా.. కేవలం రెండు నెలల్లోనే రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేశారు. అలాగే మనోహరాబాద్ కలిగోట్ గ్రామాల మధ్య రూ.4 కోట్లతో వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. అక్కడక్కడ సీసీ కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. ఈ డబుల్ రోడ్డు పూర్తి కావడంతో భీంగల్ ప్రాంత ప్రజలు నిజామాబాద్, హైదరాబాద్ వెళ్లడానికి సులభంగా మారింది. భీంగల్ నుంచి చేంగల్, పడకల్ వయా డిచ్‌పల్లి మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్లవచ్చు. ఈ డబుల్ రోడ్డు వల్ల రవాణా సౌకర్యం మెరుగుపడడంతో పాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందనుంది.

**ఆనందంగా ఉంది..**

మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. తక్కువ కాలంలోనే డబుల్ రోడ్డు పనులు పూర్తవడం చాల ఆనందంగా ఉంది.

–తనుజారెడ్డి, జెడ్పీటీసీ, జక్రాన్‌పల్లి

# వినాయకుడికి విశిష్ట పూజలు



కలెక్టరేట్‌లో గణపతి పూజలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు



నగరంలో అన్నదానం నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్



సిరికొండలో అన్నదానం చేస్తున్న భక్తులు

సాక్షి నెట్‌వర్క్: నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం నగరంతోపాటు వివిధ మండలాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద నిర్వాహకులు ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలను శోభాయాత్రగా తీసుకువెళ్లి, స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. నగరంలోని కలెక్టరేట్‌లో మహిళలు 101 హారతులతో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జెడ్పీ చైర్మన్ విఠల్‌రావుతో పాటు అదనపు కలెక్టర్ యాదిరెడ్డి హాజరయ్యారు. అన్నిశాఖల ఉద్యోగులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం చందాదారులకు డ్రా నిర్వహించారు. కలెక్టరేట్ ఉద్యోగులు నరేష్, కిరణ్, నాగరాజు, లక్ష్మణ్, రాజ్‌కుమార్‌కు వెండి గణపతులను విఠల్‌రావు, యాదిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. లడ్డు కోసం డ్రా తీయగా సుశీల్ సొంతం చేసుకున్నారు. నగరంలోని పలు గణపతి మండపాల వద్ద బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు.



మోపాల్‌లో ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాలు



నగరంలోని జర్నలిస్టు కాలనీలో..



రాజస్థానీ సేవా సమాజ్ సంఘం ఆధ్వర్యంలో వివిధ రకాల వేషధారణలో సభ్యులు

## సంక్షిప్తం

**ఘనంగా సీఎస్ఐ చర్చి ఆవిర్భావ దినోత్సవం**



డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి, బర్ధిపూర్ సీఎస్ఐ చర్చిలలో బుధవారం చర్చ్ ఆఫ్ సౌత్‌ఇండియా (దక్షిణ ఇండియా సంఘం) 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు జార్జ్, స్టీవెన్‌కుమార్, దినకర్‌లు మాట్లాడుతూ.. క్రీస్తు సందేశాన్ని విన్పించారు. ఆయా గ్రామాల క్రైస్తవులు పాల్గొన్నారు.

**పరిశుభ్రతను పాటించాలి**



సిరికొండ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతను పాటించాలని మెడికల్ ఆఫీసర్ అరవింద్ సూచించారు. మండలంలోని చీమన్‌పల్లి గురుకుల విద్యాలయంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం విద్యార్థుల భోజనాన్ని, వంటశాలలను పరిశీలించారు. సీహెచ్‌వో అనంత్‌రావు తదితరులు ఉన్నారు.

**బంజారా భవన నిర్మాణ శంకుస్థాపనకు తరలిరావాలి**

ఇందల్వాయి: అక్టోబర్ 1న జిల్లా కేంద్రంలో జరగనున్న బంజారా భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి గిరిజనులు తరలిరావాలని గిరిజన నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో బుధవారం వారు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రమేష్ నాయక్, నాయకులు మోహన్ నాయక్, తుకారం నాయక్ ఉన్నారు.

**కులరహిత సమాజం కోసం పోరాడుదాం**

డిచ్‌పల్లి: మహాత్మా జ్యోతిబాపూలే స్ఫూర్తితో కులరహిత సమాజానికై పోరాడాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్య పిలుపునిచ్చారు. మండలంలోని ఘన్‌పూర్‌లో బుధవారం సత్యశోదక్ సమాజ్ 150వ వార్షికోత్సవం సందర్భంగా కుల నిర్మూలన సదస్సు నిర్వహించారు. నాయకులు జేపీ గంగాధర్, సాయిరెడ్డి, ఎర్రన్న, కృష్ణాగౌడ్, భారతి, సాయినాథ్, పద్మ, బన్నీ, చిన్నన్న పాల్గొన్నారు.

**విద్యార్థులకు అభినందన**



ఇందల్వాయి: ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి వాలీబాల్ పోటీల్లో ఇందల్వాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు చక్కని ప్రతిభ కనబర్చినట్లు వ్యాయమ ఉపాధ్యాయురాలు సుష్మ తెలిపారు. అండర్–17, అండర్–14 విభాగాల్లో పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానాల్లో నిలిచి బహుమతులు సాధించారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

**ఆర్థికసాయం అందజేత**



ఇందల్వాయి: ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో లింగస్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అతడి భార్య క్యాన్సర్‌తో బాధపడుతూ, ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో స్టేషన్ సిబ్బంది బుధవారం బాధిత కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సాయాన్ని అందించారు.

**విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు**

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని తొండాకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నందిపేట్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### హైపర్ టెన్షన్‌పై అవగాహన ర్యాలీ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని సన్‌రైజ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో హైపర్ టెన్షన్(అధిక రక్తపోటు)పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు ధన్‌పాల్ వినయ్‌కుమార్, గోపికృష్ణ మాట్లాడుతూ.. 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు 6నెలలకు ఒక్కసారి బీపీ రక్తపోటు చెక్ చేసుకోవాలన్నారు. సిబ్బంది తదితరులు ఉన్నారు.

### బోధన్‌లో రక్తదాన శిబిరం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఉమర్ ఫారూఖీ మజీద్ వద్ద మిలాద్ ఉన్–నబీ పండుగ సందర్భంగా మిలాద్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఏసీపీ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. పలువురు యువకులు రక్తదానం చేశారు.

### యూనిఫామ్స్ పంపిణీ



నిజామాబాద్ సిటీ: అర్సపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ ఎంపీ శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా మాజీ కార్పొరేటర్ కులాచారి వెంకటేశ్వర్‌రావు యూనిఫాంలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నాయకాడి నరసయ్య, గ్రామ పెద్దలు తదితరులుపాల్గొన్నారు.

### మున్సిపల్ కార్మికులకు వైద్యశిబిరం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ ఉద్యోగులకు, కా ర్మికులకు వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వినీత, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ తదితరులున్నారు.

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 60,650 | వెండి (కిలో) | 75,500 |
| 22 క్యారెట్స్ | 56,010 | - నిజామాబాద్ బిజినెస్ | |

### మాంసం ధరలు (రూ.)

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు | డ్రెస్స్‌డ్ | 180 |
| | (కిలోకు) | లైవ్ | 160 |
| స్కిన్‌లెస్ | 240 | మటన్ | 750 |

### కూరగాయల ధరలు (రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 6 | 12 | గాజరుగడ్డ | 30 | 50 |
| బెండకాయ | 20 | 40 | పచ్చిమిర్చి | 30 | 50 |
| జీరకాయ | 20 | 40 | దోసకాయ | 20 | 40 |
| దొండకాయ | 30 | 50 | ఆలుగడ్డ | 16 | 30 |
| బీర్నీసుకాయ | 40 | 60 | గోబిగడ్డ | 15 | 30 |
| కాకరకాయ | 25 | 50 | గోబిపువ్వు | 25 | 50 |
| వంకాయ | 40 | 60 | బీట్‌రూట్ | 35 | 60 |
| పాలకూర | 50 | 70 | కరివేపాకు | 40 | 60 |
| మెంతికూర | 70 | 90 | చామగడ్డ | 40 | 60 |
| కొత్తిమీర | 50 | 70 | గోరుచిక్కుడు | 40 | 60 |
| పుదీనా | 50 | 70 | చిక్కుడుకాయ | 60 | 90 |
| క్యాప్సికం | 25 | 50 | | | |

- సుభాష్‌నగర్

### వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | స్కంద(తెలుగు)-10.10 1.20 4.30 7.40 10.50 |
| స్క్రీన్-2 | -ఫుక్రేయ్-3(హిందీ)-10.25 4.30 ది వాక్సిన్‌వార్(హిందీ)-1.20 10.30 |
| | జవాన్(హిందీ)- 7.25 |
| స్క్రీన్-3 | చంద్రముఖి-2(తెలుగు)-10.35 1.40 4.40 7.45 10.45 |

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | చంద్రముఖి-2(తెలుగు)- 11.40 6.25 జవాన్(హిందీ)- 3.00 9.45 |
| స్క్రీన్-2 | -స్కంద(తెలుగు)- 11.10 2.40 6.10 9.40 |
| స్క్రీన్-3 | ది వాక్సిన్ వార్(హిందీ)- 12.05 6.40 10.05 మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి(తెలుగు)- 3.30 |
| స్క్రీన్-4 | - స్కంద(తెలుగు)-12.15 ఫుక్రేయ్-3(హిందీ)- 3.45 7.00 10.15 |
| దేవి | 7/జీ బృందవన్ కాలనీ-11.00,9.00 మార్క్ ఆంటోని(తెలుగు)-2.15,6.15 |
| నటరాజ్ | -స్కంద(తెలుగు) |
| లలితామహల్ | చంద్రముఖి-02 (తెలుగు) |
| విజయ్ | స్కంద(తెలుగు) |